క్లుప్తంగా

విద్యార్థినులకు రక్షణ కల్పించాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: ఏపీ గురుకుల జూనియర్ కాలేజీలో విద్యార్థినులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. శుక్రవారం బనవాసి ఏపీ గురుకుల జూనియర్ కాలేజీకి వెళ్లి రెండు రోజుల క్రితం జరిగిన ఘటనపై ఆయన ఆరా తీశారు. విద్యార్థినులకు ధైర్యం చెప్పారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీపీ గొల్ల కేశన్న, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రఘు ఉన్నారు.

● మహిళలు, విద్యార్థినులకు రక్షణ కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప విమర్శించారు. కళాశాలకు వెళ్లి వారు విద్యార్థినులతో మాట్లాడారు.

దేవరను ప్రశాంతంగా జరుపుకోండి

కోసిగి: మండల కేంద్రంలో ఈనెల 7, 8వ తేదీల్లో జరగనున్న గ్రామ దేవత దేవరను ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ ఉపేంద్రబాబు సూచించారు. శుక్రవారం కోసిగిలోని సిద్ధప్పపాళెం, కింది మారెమ్మ, చింతలగేని మారెమ్మవ్వ దేవాలయాలను కోసిగి సీఐ మంజునాథ్, ఎస్ఐ చంద్రమోహన్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని ప్రజలతో దేవర వివరాలను అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతలకు ఇబ్బందులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదన్నారు. అక్రమ మద్యం తరలించకుండా ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. మంత్రాలయం సీఐ రామాంజులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అందరి సహకారంతోనే పాఠశాలల అభివృద్ధి

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉప విద్యాధికారి వెంకటరమణారెడ్డి, మండల విద్యాధికారి శ్రీనివాసులు అన్నారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ కమిటీ మెంబర్లకు పాఠశాలల అభివృద్ధిపై శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజనం తదితర వాటిపై ఎస్ఆర్పీలు సురేంద్ర, బాపూజీ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్పీలు మునీర్, మల్లికార్జున, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలి



డైరీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ బీటీ నాయుడు

ఆదోని సెంట్రల్: విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. స్థానిక ఎమ్మెల్సీ కార్యాలయంలో ఎస్టీయూ డైరీ, క్యాలెండర్లను ఎమ్మెల్సీ చేతుల మీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలను నేర్పించాలని తెలిపారు. పురపాలక ఉపాధ్యాయుల సమస్యలు, ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏ బకాయిలపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. ఎస్టీయూ నాయకులు నాగేంద్రప్ప, రమేష్ నాయుడు, వీరచంద్ర యాదవ్, లోక్యానాయక్, ప్రహ్లాద్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం తగదు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో పారిశుద్ధ్య పనులు చేపట్టడంలో నిర్లక్ష్యం తగదని కార్మికులను మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. శుక్రవారం శిల్పా కాలనీలో పారిశుద్ధ్య పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కాగా కరోనా, అనారోగ్యంతో మృతి చెందిన 12 మంది పారిశుద్ధ్య కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని సీఐటీయూ నాయకులు కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

సక్రమంగా రేషన్ అందజేయాలి



బియ్యం నిల్వను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్

ఎమ్మిగనూరురూరల్: కార్డుదారులకు సక్రమంగా రేషన్ అందజేయాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. శుక్రవారం సాయంత్రం ముగతి రోడ్డులోని ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్‌ను ఆయన తనిఖీ చేశారు. గోడౌన్‌లో బియ్యం, నిత్యావసర సరుకుల నిల్వను, రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ శేషఫణి, స్టాక్ పాయింట్ ఇన్‌చార్జ్ డీటీ మహేష్, ఆర్ఐ లక్ష్మన్న ఉన్నారు.

సావిత్రీబాయి పూలే నిత్య చైతన్యమూర్తి

● బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దేవపూజ ధనుంజయ

ఆదోనిటౌన్: మహిళా విద్యకు మార్గదర్శకురాలైన సావిత్రిబాయిపూలే నిత్య చైతన్యమూర్తి అని బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దేవపూజ ధనుంజయ అన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరినాయుడు ఆధ్వర్యంలో సావిత్రీబాయిపూలే జయంతి వేడుకలను పట్టణంగా ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిమ్నవర్గాల అభ్యున్నతికి కృషి చేసిన జ్యోతిరావుపూలే సతీమణి సావిత్రీబాయిపూలే భారతీయ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రిగా ఎంతో మంది మహిళలను చైతన్యం చేసిందన్నారు. కులమతాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన స్వరూపిణి అని, ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యమని నమ్మిన ఆమె తన భర్తతో కలిసి 1848 జనవరి 1న పూనేలో మొదటగా బాలికల పాఠశాలను ప్రారంభించి ఎందరో మహిళలకు చదువు నేర్పిందన్నారు. ఆమె సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షులు కత్తి హనుమంతరావు, గౌరవ సలహాదారు బండారి రాజేశ్వరరావు, తాలూకా అధ్యక్షులు మరియాని చెన్నబసప్ప, గౌరవ సలహాదారులు బి.రాముడు, వీరభద్ర, పట్టణ ఉపాధ్యక్షులు ఎం.రామకృష్ణ, జనరల్ సెక్రటరీ బి.మల్లేశ్వరప్ప, ఆర్గనైజ్ సెక్రటరీ సోమశేఖర్ పాల్గొన్నారు.

నేటి మహిళలకు సావిత్రీబాయి పూలే ఆదర్శం

ఆదోని సెంట్రల్: చదువుల తల్లి సావిత్రీబాయి పూలే నేటి మహిళాలోకానికి ఆదర్శమని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని నేషనల్ కళాశాలలో ఆమె జయంతిని పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఆడపిల్లలు చదువుకోకూడదని నిబంధనలు ఉన్న రోజుల్లో బాలికల చదువు కోసం ఆమె చేసిన కృషి మరువలేనిదన్నారు. ఎన్నో అవమానాలు, బెదిరింపులను ఎదుర్కొని బాలికల చదువు కోసం వసతి గృహాలను ఏర్పాటు చేసి చదువు నేర్పించిందన్నారు. వితంతువులను చేరదీసి ఆదుకుందన్నారు. తన భర్త జ్యోతిరావు పూలే ప్రోత్సాహంతో ఇంట్లోనే అక్షరభ్యాసం చేసి విద్యావంతురాలైందన్నారు. ఎన్నో అవమానాలు, దాడులను ఎదుర్కొని స్త్రీలకు ప్రత్యేక స్థానం కల్పించిన ఘనత సావిత్రీబాయికే చెల్లుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శశిధర్, మోహన్, మల్లికార్జున, రాజు, మహేష్ పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలే జీవితం ఆదర్శం



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ ఫెడరేషన్ నాయకులు



కౌతాళంలో ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న దృశ్యం

కౌతాళం: మహిళలందరికీ సావిత్రీబాయి పూలే జీవితం ఆదర్శమని ప్రతిభ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానేశ్వరి, ఉపాధ్యాయులు జయలక్ష్మి, సయ్యదా సబిహా అన్నారు. శుక్రవారం సావిత్రీబాయి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ సయ్యద్ మైనుద్దీన్ పాల్గొన్నారు.

బాలికా అక్షరాస్యత దినోత్సవంగా ప్రకటించాలి

గోనెగండ్ల: భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు, సాంఘిక సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే జయంతిని బాలికా అక్షరాస్యత దినోత్సవంగా ప్రకటించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్ డిమాండ్ చేశారు. గోనెగండ్లలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆమె జయంతిని ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని ఆయా పాఠశాలల్లో సావిత్రీబాయి పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల విద్యా వ్యాప్తికి ఎనలేని కృషి చేశారన్నారు. సావిత్రీబాయి అడుగుజాడల్లో నడుస్తూ బాలికల విద్యా వ్యాప్తికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు దండు ఖాజా, మల్లికార్జున, రంగన్న, తిమ్మప్ప, సూరి, మస్తాన్, నాగేష్, ఈరన్న, ఉరుకుంద పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి

మంత్రాలయం: మండల పరిధిలోని చిలకలడోన కేజీబీవీ పాఠశాలలో ప్రిన్సిపాల్ శాంతి, బీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రామతీర్థం అమరేష్, బోయ విజయుడు ఆధ్వర్యంలో శుక్రవారం సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలికల విద్య కోసం ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఆమె ఆశయ సాధనకు కృషి చేద్దామన్నారు. ఇందులో బీఎస్ఎస్ జిల్లా కార్యదర్శి ప్రసన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఖలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పాఠశాల ప్రార్థన సమయంలో విద్యార్థుల సమక్షంలో సావిత్రీబాయి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కేవీపీఎస్ నాయకులు

ఎస్టీయూ ఆధ్వర్యంలో ..



సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్టీయూ నాయకులు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాలలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను శుక్రవారం ఎస్టీయూ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ నాయకులు నాగరాజు, రమేష్ నాయుడు, కళ్యాణి, మల్లికార్జున మాట్లాడుతూ భారత దేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయిని సావిత్రీబాయి పూలే అన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకొని ప్రతి విద్యార్థినీ కష్టపడి చదవాలన్నారు. కార్యక్రమములో ఎస్టీయూ నాయకులు వీరచంద్ర యాదవ్, లోక్యనాయక్, సుధాకర్, ప్రహ్లాద, భీమరాజు, గురుస్వామి, నాయక్,జయరాం, గఫూర్, రాముడు పాల్గొన్నారు.

మహిళల జీవితాల్లో వెలుగులు నింపిన సావిత్రీబాయి

ఎమ్మిగనూరుటౌన్: మహిళల జీవితాల్లో వెలుగులు నింపిన మహోన్నతురాలు, భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే అని బాలుర, బాలికల హైస్కూల్ హెచ్ఎంలు చిత్రలేఖ, కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంఎస్ బాలికల హైస్కూల్‌లో సావిత్రీబాయి పూలే విగ్రహానికి ఉపాధ్యాయినులు పూలమాలలు వేసి నివాళులర్పించి ఆమె విద్యాభివృద్ధికి అందించిన సేవలను కొనియాడారు. ఎస్ఎస్ఎస్, వీవర్స్ కాలనీ ఉన్నత పాఠశాలలో సావిత్రీబాయిపూలే చిత్రపటాలకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయినులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకుముందు బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎంతోపాటు ఉపాధ్యాయినులకు ప్లాటినం జూబ్లీ వేడుకల ఆహ్వాన కమిటీ సభ్యులు ఎంసీ శివకుమార్, ప్రకాష్ జైన్, బైపుప్పుల షఫీవుల్లా, మాచాని వెంకటేష్, ఈరన్న గౌడ్ సత్కరించారు.



ఎమ్మిగనూరు బాలుర హైస్కూల్‌లో సావిత్రీ బాయ్ పూలే చిత్రపటానికి నివాళులు అర్పించి ఉపాధ్యాయినిలని సత్కరించిన దృశ్యం

నోబుల్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో..

ఆదోని రూరల్: స్థానిక నోబుల్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో సావిత్రీబాయిపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ సంగటి దేవదానం, ప్రిన్సిపాల్ అబ్దుల్‌బాషా ఆధ్వర్యంలో సావిత్రీబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో మహిళల విద్య పట్ల వ్యతిరేకత ఉన్న కాలంలోనే తొలి భారతీయ మహిళా ఉపాధ్యాయురాలిగా ఎదిగిన సావిత్రిభాయిపూలే ఎందరికో ఆదర్శమన్నారు. ఆమె అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడవాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు సలోమి, ఖాలక్, దినాకర్, త్యాగరాజు, రాజరంగ, ఎస్ఎఫ్ఐ శ్రీను, స్రవంతి, నిఖిల, ప్రీతి పాల్గొన్నారు.



సావిత్రీబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాశాల కరస్పాండెంట్, అధ్యాపకులు

మండల అభివృద్ధే లక్ష్యం

● ఎంపీపీ శ్రీవిద్య

పెద్దకడబూరు: మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు మండల అభివృద్ధికి పాటుపడాలని ఎంపీపీ శ్రీవిద్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఇటీవల మృతి చెందిన మాజీ ఎంపీపీ, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు హనుమంతరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి రెండు నిమిషాల మౌనం పాటించారు. అనంతరం మండల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. హెచ్.మురవణి ఎంపీటీసీ సభ్యురాలు బేబీ ఉమా మాట్లాడుతూ.. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్లను అంగన్‌వాడీ టీచర్లు లబ్ధిదారులకు ఇవ్వకుండా అమ్ముకుంటున్నారని సభ దృష్టికి తెచ్చారు. హెచ్.మురవణి ఎంపీటీసీ సభ్యురాలు- 2 ఈరేశమ్మ మాట్లాడుతూ.. తాగునీటి కోసం ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని.. పలుమార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని వాపోయారు. వైస్ ఎంపీపీ-2 ముత్తమ్మ మాట్లాడుతూ..చిన్నతుంబళంలో సీసీరోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. సర్వసభ్య సమావేశం అని తెలిసినా కొందరు అధికారులు సమయపాలన పాటించకుండా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడంపై మండిపడ్డారు. 11గంటలకు సమావేశం అని తెలిసినా సమయానికి రాకపోవడం, మరి కొంతమంది అధికారులు అసలు సమావేశానికే రాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. అసలు మండలంలో అధికారులు పని చేస్తున్నారా అని ప్రశ్నించారు. ప్రతి సమావేశంలో అభివృద్ధికి సహకరించండి అని తాను చెప్పడం అధికారులు మాత్రం నిమ్మకుండిపోవడం పరిపాటుగా మారిందన్నారు. ఇకపై అలా జరగడానికి వీలు లేదన్నారు. అధికారులు అభివృద్ధికి సహరించడంతో పాటు సమయపాలన పాటించి ప్రజా ప్రతినిధులకు అందుబాటులో ఉండాలని సూచించారు. లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. వైస్ ఎంపీపీ-1 ఇర్ఫాన్ దేశాయి, తహసీల్దార్ శ్రీనాథ్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జయరాముడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



తాగునీటి సమస్యపై ఎంపీపీకి ఫిర్యాదు చేస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు ఈరేశమ్మ

హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయండి

ఆదోని అర్బన్: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో జరగనున్న హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని పరిషత్ జిల్లా అధ్యక్షుడు బసవన్నగౌడ్ పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయం వద్ద శుక్రవారం మొట్టమొదటగా ఆదోని నుంచి వాహనం బయలుదేరింది. ఈ మేరకు విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు జెండా ఊపి వాహనాన్ని విజయవాడకు పంపించారు. విరాట్ హిందుస్థాన్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు మాట్లాడారు. దేశంలో ఉన్న హిందువుల ఆలయాలు, ఆధ్యాత్మిక స్థలాల రక్షణ కోసం స్వయం ప్రతిపత్తి దక్కించుకోవడానికి విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విజయవాడలో ఆదివారం హైందవ శంఖారావం సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం మధ్యాహ్నం ఆదోని నుంచి 80 వాహనాలు వెళ్తాయని, మధ్యాహ్నం 3 గంటల్లోపు మున్సిపల్ క్రీడా మైదానానికి చేరుకోవాలని పేర్కొన్నారు. వాహనాల్లో వెళ్లేవారు ముందుగా వచ్చి పాసులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, విరాట్ హిందుస్థాన్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

దుకాణాల్లో తూనికల కొలతల అధికారుల తనిఖీ



బంగారు దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

ఆదోని అర్బన్: పట్టణంలోని దుకాణాల్లో తూనికల కొలతల అధికారులు శుక్రవారం తనిఖీలు చేశారు. 75 దుకాణాల్లో తనిఖీలు చేయగా 11 దుకాణాలు నిబంధనలు అతిక్రమించినట్లు గుర్తించి రూ.45 వేలు జరిమానా విధించినట్లు తూనికల కొలతల అసిస్టెంట్ కంట్రోలర్ శ్రీరాములు తెలిపారు. బంగారం, కిరాణా తదితర దుకాణాల్లో తనిఖీలు చేసినట్లు చెప్పారు. దుకాణాల్లో తూనికల్లో రాళ్లకు ముద్రలు లేకపోవడం వల్ల నిబంధనలు అతిక్రమించినందుకు 11 దుకాణాలకు మొత్తం రూ.45 వేలు జరిమానా విధించామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈయనతో పాటు ఇన్‌స్పెక్టర్‌లు శ్రీనివాసులు, పరమేష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల రాత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

ఆదోని రూరల్: రేషన్ డీలర్ల రాత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. శుక్రవారం ఆదోని పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈనెల 5వ తేదీ జరగనున్న రేషన్ డీలర్ల రాత పరీక్షకు సంబంధించిన కేంద్రాన్ని సబ్‌కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఆదోని డివిజన్‌లోని 78 డీలర్ల నియామకం కోసం 512 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇందులో సరైన పత్రాలు లేనందున 45 దరఖాస్తులను తిరస్కరించినట్లు చెప్పారు. 467 దరఖాస్తులకు హాల్ టికెట్లు మంజూరు చేశామన్నారు. తహసీల్దార్ కార్యాలయాల్లో హాల్ టికెట్లు ఇస్తున్నట్లు చెప్పారు. జనవరి 5వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 11:30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. అభ్యర్థులు ఉదయం 9:30 గంటల్లోపు పరీక్ష కేంద్రంలో ఉండాలన్నారు. పరీక్షకు ఒరిజినల్ హాల్ టికెట్, ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు. పరీక్ష కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలైన గడియారం, క్యాలిక్యులేటర్, మొబైల్ ఫోన్‌లకు అనుమతి లేదన్నారు. రాత పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి 1:5 నిష్పత్తి ప్రకారం ఈనెల 6వ తేదీ ఇంటర్వ్యూ నిర్వహిస్తామని తెలిపారు. అభ్యర్థులు నిబంధనలు పాటించాలన్నారు. పౌర సరఫరాలశాఖ ఉప తహసీల్దార్ వలీబాషా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఖాసీం, వీఆర్వో రాజశేఖర్‌గౌడ్ ఉన్నారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మిగనూరురూరల్: మహిళలు, విద్యార్థినులపై జరుగుతున్న అఘాయిత్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని రూరల్ సీఐ మధుసుధన్‌రావు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని బనవాసి ఏపీ గురుకుల జూనియర్ కాలేజీలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో ప్రిన్సిపాల్ గిరివాణి, రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

హిందువులపై దాడులను ఆపండి

ఆదోని అర్బన్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఆపాలని కోరుతూ శుక్రవారం లబ్బాయిక్ ఆదోని సొసైటీ, మదర్స ఈ నిజామియా, ఆదోని ముస్లిం కమ్యూనిటీ ఆధ్వర్యంలో ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. స్థానిక మసీదు నుంచి ప్రధాన రహదారుల గుండా సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ సబ్‌కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. మత గురువు హాజీ అల్తాఫ్‌హుసేన్ పాల్గొన్నారు.

పోస్టులను భర్తీ చేయాలని నిరసన

ఆదోని సెంట్రల్: పాఠశాలల్లో భాష సహాయక పోస్టులను భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య అధ్యక్షుడు అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి జంగం బసవరాజు డిమాండ్ చేశారు. స్థానిక నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాల అవరణలో ఏపీ ఎంటీఎఫ్ నాయకులు భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పురపాలక ఉపాధ్యాయులకు సంబంధించి పదోన్నతులను చేపడితే కర్నూలు జిల్లాలో మాత్రం చేపట్టడం లేదన్నారు. అర్హత కలిగిన పురపాలక ఉపాధ్యాయులు నిరాశకు గురవుతున్నారని తెలిపారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, నాయకులు దస్తగిరి, మద్దయ్య, నూర్ ఉల్హక్, చంద్రమౌళి పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

ఆదోని రూరల్: మండలంలోని పాండవగల్ గ్రామంలో వై.అంజినయ్య(42) అనే ఉపాధి కూలీ పనులు చేస్తూ గుండెపోటుకు గురై మృతిచెందారు. గమనించిన తోటి కూలీలు వెంటనే అతన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. 9 ఏళ్ల క్రితమే భార్య అనారోగ్యంతో మృతిచెందింది. తల్లిదండ్రులను కోల్పోవడంతో పిల్లలు అనాథలయ్యారు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.లింగన్న, మండల కార్యదర్శి డి.రామాంజనేయులు డిమాండ్ చేశారు.


మున్సిపల్ పదవిని మైనార్టీలకు రిజర్వ్ చేయాలి

ఆదోని టౌన్: రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ఆదోని మున్సిపల్ చైర్మన్ పదవిని మైనార్టీ వర్గానికి రిజర్వ్ చేయాలని ఆదోని ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. జేఏసీ కన్వీనర్ నూర్ అహ్మద్ శుక్రవారం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో తీర్మానాన్ని చేశారు. ఆదోని మార్కెట్‌యార్డు చైర్మన్ పదవిని బీసీ మైనార్టీ వర్గానికి రిజర్వ్ చేయడం శుభ పరిణామమన్నారు. జేఏసీ కో-కన్వీనర్ ఎండీ నూర్, ఎంహెచ్‌పీఎస్ నాయకులు సయ్యద్ వసీమ్ సాహెబ్ ఖాద్రి, ఎంఐఎం నాయకులు జునైద్, నాసిర్, హెచ్ఆర్ఎఫ్ నాయకులు ఖాదర్‌బాషా, ఎస్‌డీపీఐ నాయకులు నాసీర్, సద్దాం హుసేన్, న్యాయవాది మహమ్మద్ వసీమ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముస్లిం జేఏసీ కన్వీనర్ నూర్ అహ్మద్

● ఆహ్వానం



ఎమ్మిగనూరు ప్రభుత్వ బాలుర హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈనెల 12న నిర్వహిస్తున్న ప్లాటినం జూబ్లీ వేడుకలకు హాజరు కావాలని మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆహ్వాన పత్రికను అందజేశారు.

– ఎమ్మిగనూరుటౌన్

ఘనంగా సుంకులమ్మ విగ్రహ ప్రతిష్టాపన



సుంకులమ్మ దేవిని దర్శించుకుంటున్న భక్తులు

కోసిగి: స్థానిక బాలుర ఉన్నత పాఠశాల వెనుక భాగంలోని ఓవర్ హెడ్ ట్యాంక్ సమీపంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సుంకులమ్మ దేవి విగ్రహ ప్రతిష్టాపన ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్యామ్ సుందర్ రాజు దొర సహకారంతో నూతన ఆలయం నిర్మించారు. ఆలయ ప్రాంగణంలో మూడు రోజుల పాటు వేద పండితులు ఆధ్వర్యంలో హోమాలు, గణపతి పూజ, కార్యక్రమాలు చేపట్టారు. శుక్రవారం వేకువజామున ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకుని కొబ్బరికాయలు, ఫల,పుష్పాలు అందజేసి పూజలు చేశారు. ఎంపీపీ ఈరన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు నాడుగేని నాగరాజు, మహంతేష్ స్వామి, కృష్ణమూర్తి, బుళ్లి నరసింహులు, వీరస్వామి, ప్రతాప్, కాంట్రాక్టర్ నాగరాజు, వెంకటేష్, మల్లికార్జున గౌడ, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

బ్యానర్ల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

ఆదోని టౌన్: పట్టణంలో అనుమతి లేకుండా బ్యానర్లు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ హెచ్చరించారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌ను ట్రాఫిక్ పోలీసులు కలిశారు. పట్టణంలో ఎక్కడపడితే అక్కడ బ్యానర్లు, పోస్టర్లు ఏర్పాటు చేస్తున్నారని, తద్వారా ప్రజలకు ఇబ్బంది కలగడమేకాకుండా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందని సీఐ గంటా సుబ్బారావు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే బ్యానర్లు, పోస్టర్లను తొలగించేందుకు అనుమతినివ్వాలని ట్రాఫిక్ పోలీసులు కమిషనర్ ఎం.కృష్ణను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారుల అనుమతి లేకుండా పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ బ్యానర్లు, పోస్టర్లు ఏర్పాటు చేస్తే పోలీసులు కేసు నమోదు చేస్తారని తెలిపారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. రాజకీయ నాయకులు, సినీ, రాజకీయ నాయకుల అభిమానులు ఎక్కడ పడితే అక్కడ బ్యానర్లు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దని కోరారు.



కమిషనర్‌తో మాట్లాడుతున్న ట్రాఫిక్ పోలీసులు

సాంకేతిక లోపంతో నిలిచిన బస్సు

ఎమ్మిగనూరుటౌన్: కర్నూలు నుంచి ఎమ్మిగనూరుకు వస్తున్న ఆర్టీసీ బస్సు శుక్రవారం స్థానిక బైపాస్ రోడ్డు సమీపంలో సాంకేతిక లోపంతో నిలిచిపోయింది. మార్గమధ్యలో బస్సు నిలిచిపోవడంతో ప్రయాణికులు కాస్త ఇబ్బంది పడ్డారు. కాలం చెల్లిన బస్సులను పక్కకు పెట్టి కండీషన్‌లో ఉన్న బస్సులు నడపాలని ప్రయాణికులు ఆర్టీసీ అధికారులను కోరారు.